పరిణయ చిహ్నం

శ్రీ కాశీభట్ల సూర్యనారాయణశాస్త్రి

అది అతిఘోరం — మహాఘోరం — మహాప్రళయం. కాదు జీవితానికి మరపుతీరని మచ్చ—ప్రేమలతా కుంజ మునకు గొడ్డలిపెట్టు—ప్రియులపాలిట పెనుభూతం—కాదు కాముకీకాముకుల కలయికకు కత్తిపోటు—ప్రణయ సామ్రాజ్యపతనానికి పెద్దమెట్టు—కాదు విలాసమానసాలకు బలుసుముల్లు—పరస్పరానురాగ ప్రవాహానికి ఆనకట్టు—కాదు, కాదు ప్రణయపూరిత హృదయాలకు ములుకులాంటి పలుకు—ఇంకెందుకు ?—విపరీత విపత్కర విషాదపూరితమైన దుర్వార్త: అంతేకాదు—రోషావేశావృతమైన కర్ణ కఠోర కఠినోక్తి!!

"ఆగు ఆగు శంకరం ? ఆగవేం? నిన్నే, ఏయ్ ఆపండి భజంత్రీలు. నిన్నేనయ్యా? ఆపవయ్యా! నీవూపు మంత్రం." అంటూ శాస్త్రిల్లను అరికట్టేశాడు, శరవేగంతో వస్తూ లలిత తండ్రి.

తీర్చిదిద్ది, పచ్చని తోరణాలతో అలంకరింపజేసిన ఆవరణలో, రెండువేల ప్రేక్షక జనసమూహంలో, వివిధ రకములైన మంగళ వాయిద్యములతో, పండిత శ్రేష్ఠుల పలు రకములైన స్వస్తి వాక్కులతో, కాలికి గజ్జె కట్టి విటులకు విరహమెచ్చునట్లు నటించు వేశ్య శ్రేణిలో, సకలబంధు, మిత్ర సమూహంబగు కల్యాణ మండపములో, చిరకాలము నుండి, తన కలియకకైగోరి, తన హృదయోద్యాన వనమున విహరించు సుందరియగు లలితవైపు క్రీగంట చూచుచూ—చిరునగవు మోముతో సూత్రధారణచేయు సుముహూర్త సమయమది.—

చేయునదిలేక నిశ్చేష్టుడై నిలబడిపోయాడు శంకరం. ఆశాపాశము అంతరించింది. తన హృదయ నిర్మాణ ఊహాంతస్తులు నేల కూలిపోయాయి. హృదయాధి దేవత పరాజయమైంది. సంతోషము క్షణభంగురమైంది. సభా మండపమంతా గలభా కాజొచ్చింది. 'ఎందుకొరకై ఆటంకమా!' అని చూపరులందరూ వెలవెలబోయి చూస్తూ సమాధానం కొరకై వేచివున్నారు. 'నావల్ల అపరాధమేమా' అని శంకరం తండ్రి అంధుడగుటచే, వియ్యంకుని వైపు చెవులు నిగిడ్చి, తడుముకుంటున్నాడు. తన ప్రణయ రజ్జువు బిఱ్ఱ బిగిసి, ఛేదింప బడుటకు కారణమేమా అని నిర్ఘాంతపోయి, తల క్రిందకువంచి ప్రియుని పాదపద్మముల మీద బొటబొటమని కన్నీటిచుక్కలు కార్చటం మొదలు పెట్టింది లలిత.

"ఏమండీ! మీకేమైనా జ్ఞానం గలదా? ఏం! మాట్లాడరేం? కలియుగ యుధిష్ఠిరుడులా తడుముకుంటూ కంగారు పడతారేం? మీకు భూవసతి ఎక్కువగలదనిచెప్పి, కపటమాటలతో మాకళ్లుగప్పి అన్యాయం చేస్తారా? ఆ వున్న కొద్ది వసతియైనా అప్పులతో కప్పబడిందటగా! ఏం? అంత దిటవుగా చెప్పారు? నీకేమైనా .."అంటూ పెద్ద పెద్ద గర్జనలతో కరములు జాపుకుంటూ వరుని వద్దకు వచ్చి "నాకు నచ్చలేదు యీ అబద్ధాల సంబంధం. కూతుర్కు మరొక వివాహముచేస్తా. ఆపవోయ్! సూత్రం కట్టడం? ఇదిగో మీనలుగు సొమ్ము. ఎవరికి కావాలి?" అంటూ వెయ్యి రూకలూ విరజిమ్మేడు లలిత తండ్రి.

అది కల్యాణమండపమా—లేక కదన రంగమా! అనుకుంటున్నారు అమాయికప్రజలు, ఒళ్లంతా కళ్లు చేసికుని చూసే వృద్ధ పురోహితుడు పాపం! పారజల్లిన వెయ్యి రూపాయిలూ ఏరుకొంటూ 'ఆహా! ఎంతలో ఎంత విపరీతం! కాల ప్రవాహంలో అన్నృతమెంత వింతగా పరిణమించింది. "అదేమిటి. వకీలుగారు! ఇదిమీకు భావ్యంగాదు. ఏమిటింత రసాభాసు. ప్రాణవిత్తమాన...అన్నట్లు వివాహ కాలంలో బొంకవచ్చునని ధర్మశాస్త్రిం. కాని, మీరిదివరకే తెలుసుకొనవలసింది అంటూ అడ్డు వెళ్లాడు. 'వెళ్లవయ్యా చెప్పొచ్చావు. నీ డబ్బుకోసమని కల్లబొల్లి కబుర్లు చెప్పి పిల్ల భవితవ్యాన్ని నాశనం చేద్దామని బయలుదేరావు. ఇంక అక్కడిక్కి వూరుకో. ఇట్లా ఎందర్ని మోసంచేద్దామని? ఇదిగో చెబుతున్నా—పీటలమీదనుంచి లేచిపోవలసిందే. లేవండి? అంటూ పెద్దగా ఓంద్రపెట్టాడు లలిత తండ్రి.

కోపాగ్నిజ్వాలలు బంధుకోటిమీద భగ్గున వెదజల్లాడు వకీలు. తడుముకోకుండా వాక్శరసంపుటిని వదులుతున్నాడు వరునిమీద.

"పీటలమీద పెళ్లిపడగొట్టిన శీవచ్ఛవాన్ని ఏంచేస్తే పాపముంది? ప్రేమ పూరితులమైన మా వుభయులను ఎడబాటుచేసిన ఆ దుండుగీడును ఏంచేస్తే ఏముంది? నాకు కాబోయే పతిని దూషించి, పలువురిలో భంగపరచిన ఆ తులువను ఏంకావిస్తే నా హృదయశోక భారం క్రుంగుతుంది? నాతండ్రి అయితే ఏం?—భగవంతుడవుతే ఏం?" అనుకుంటూ పొంగి పొర్లి పోయేదుఃఖ ప్రవాహాన్ని దిగ మ్రింగుతూ మరి కొంతసేపటికి పరిపరి విధాల్లా పశ్చాత్తాప పడుతోంది తన పిత్రుదేవత తొట్రుపాటుకు లలిత.

సకల శోభాయమాన, రమనీయాలాంకృతమైన కల్యాణ మండపములో, సకల బంధు మిత్ర సపరివారముతో వెలుగొందు ఆ సభాస్థలియందు, తనకు కలిగిన అవమానము భరిరపలేక, హృదయారామమునుండి ప్రేమయుతమైన యొక్క వేడి నిట్టూర్పు 'అమ్మా'! యని విడిచి చేతిలోని మాంగల్యము మందగమన యగు లలిత పాదములపై పడవైచి—అచ్చటు నుంచొనజాలక బయలుదేరి గృహోన్ముఖుడై వెడలిపోయాడు శంకరం. వృద్ధపూర్వ సువాసినులు బుగ్గలమీద వ్రేళ్లు వేసికుని 'ఇదేంచోద్యమమ్మా! కల్యాణపు ఘటనరావద్దూ. గీటులేందే ఎట్లా అవుతుందీ?' అని కొంత మంది.

'ఏమిటీ ఆశ్చర్యం!—అగతాయి వేషమూను.' అని మరికొందరు.

'అయ్యో! గుటకపడే ఏకాష్టం గొంతు చీల్చుకుని బయటుపడే యోగముంటే ఎట్లాగవుతుందీ' అని మరి కొందరు సాగతీస్తున్నారు సహేళనగా. లలిత దుఃఖావేదనతో బయలు వెడలి తన పరుపుపై పరుంది. అంతే—అప్పటి మొదలు అనారోగ్యమే—

తొలుత శంకరం లలితలు కాలేజీలో క్లాసుమేట్సు. బి. యే. ప్యాసయి, వుద్యోగం కొరకు అన్వేషిస్తూ లలితకు తనమదిలో స్థానమిచ్చాడు శంకరం. 'విద్యకు మించిన రూపము—రూపుకు మించిన ధనము—ధనముకు మించిన ప్రేమ. ఇంకేమి కావాలి?' అని లలిత తన జీవితాన్ని శంకరాని కంకితమిచ్చింది. చివరకు సుముహూర్తము లభ్యమైంది. తుదకు భంగమైంది!

ఆహా! శుభా శుభములు దైవానుగ్రహముగదా!

లలిత భర్త్రివియోగ దుఃఖాక్రాంతయై పరమేశ్వరుని పరి పరి విధముల ప్రార్థింపసాగింది. ఇట్లు కొన్ని దినములు గడిచాయి. ఏ దుర్ముహూర్తమున మాంగల్య విసర్జన జరిగిందో, అప్పటినుండి కుసుమకోమలమైన తన శరీరము దుఃఖ భాజనముచే కృశించింది. తుట్టతుదకు శల్యచర్మావశిష్టయై, చివరిసారి తన ప్రేమికుని దర్శనంకొరకు పరితపించింది. శంకరాన్ని తన్ను చూచుటకు రమ్మనమని, యిక తన ప్రాణముల మీద ఆశవీడితినని, కడసారిచూపు యిదేనని ఒకనాడు తనసోదరునిచే శంకరానికి కబురంపింది. నిత్యము లలితపై ధ్యానము నిలిపియున్న శంకరం ఆ జాబు కన్న వెంటనే తన మోహనాంగి మోము సందర్శించుటు ఎట్లా! అని బయలు దేరాడు.

గరళకంఠుని కటాక్షమును కాముకులమీద వీక్షింపచేయుటచే, పాపమా సమయయున లలిత తండ్రి కచ్చేరీకి వెళ్లిపోయాడు. తమ్ముడుకూడా పాఠశాలకు బయలు దేరాడు. చంద్రునికొరకు చకోరము ఎదురుచూచునట్లు లలిత తన హృదయేశ్వరుని మీద మదిని నిల్పి, పరుండబోయింది. పేదలగన్న పెన్నిధివోలె పరమేశ్వరుడు నయ్యవసరంబున నచ్చట నవతరించనో యన, శంకరం అచ్చటకు వచ్చి లజ్జాజనిత హీనస్వరముతో, గద్గద యుక్తంగా 'లలితా'! అని పిలచాడు. దిగులుతో, నీరసంగా వున్న లలిత ఆ స్వరం ఎవరిదా అని తలయెత్తి చూపింది. శంకరం సిగ్గుచే కుడికాలి గోరుతో భూమిని గిల్లుతూ మోము క్రిందకు దించుకున్నాడు. లలిత అతనియెడల పరపతి చూపుతూ ప్రక్కమీద కూర్చుని 'శంకరం సిగ్గెందుకు? మన ప్రేమను ధగ్ధంచేసిన భగవంతుడు లేడూ! దిక్కులేనివానికి దేవుడే దిక్కుగాదూ! తన చక్రం చేపట్టి మన శత్రువును ఛేదించడూ?—మన యిరువురనూ తిరిగి ఐక్యం చెయ్యడూ! నటనసూత్రధారుడుగా ఆ నారాయణుడు—రా శంకరం.

ఇట్లా కూర్చో! శంకించుకోకు '—అని చెయ్యి చూపుతుంది.

పాపం శంకరం లలిత కృతజ్ఞతకు దోహదమిస్తూ ఆమె ప్రక్కన ఆసీనుడవుతాడు.

'ఏం! లలితా! ఎట్లావుంది.' నీ ఒంట్లో. అంటాడు.

'ఎలా వుందని చెప్పను. గాఢాంధకారంగావున్న చిమ్మ చీకట్లు చీల్చుకుని, ఎదుటవచ్చే యీదురుగాలిని ఓర్చుకుని, తరంగ శబ్దాల హోరుకు తాళుకుని అంతులేని సముద్రయానం చేసే నావమాదిరిగా వుంది నా శరీరం. ఏం చెప్పను—యీ రోజుకు పదిహేనురోజులు జ్వరంవచ్చి. రెండు రోజులైంది పథ్యంతిని. నిన్ను చూసేసరికి నాశనమైంది నీరసం. ఇంకా నెలదినములకుగాని కోలుకోదు నా శుష్క శరీరం. శంకరం? ఆలా వున్నావేం?' అంది లలిత.

'ఏం? ఎట్లావున్నాను?'

'దిగులుతో నున్నట్లున్నావు?

'ఇంకేముంది. అప్పటి నా అపరాధమే దీనికి కారణం.

"అపరాధమేమిటి శంకరం? నా బోటి ఆడువారికి గాని ఆ భారం. నీ కేమిటి! ఎందుకు చింతించటం. దిగులొందకు శంకరం. నెల రోజులు నిండిన తరువాత వెనుకటి వలె నిండు వెన్నెలలో విహరింపవచ్చు మనం. పండుటాకుల నీడల్లో పరుగులెత్తవచ్చును. క్షమించు శంకరం? నా తండ్రి చేసిన తప్పు తలుచుకోకు. ఇక నేను ఎక్కువగా మాట్లాడలేను. దాహమవుతోంది. అని మంచము క్రిందకు చూస్తూ వెదకబోతుంది లలిత."

'ఏం: మంచినీరా. ఇదిగో గ్లాసు యిక్కడనే వుంది.' అని నీటి గ్లాసును లలిత నోటికందిస్తాడు శంకరం.

'శంకరం నిన్ను వదలలేను. ఇకనన్ను నీవు వివాహం చేసికోవలసిందే. ఎన్ని అవాంతర కారణాలు అడ్డుపడినా సరే.—ఇక్కడ కాకపోతే మరేప్రదేశంలోనైనా సరే.' అంటుంది అర్థిస్తూను.

'ఏమిటే పిచ్చ లలితా! నిన్ను భార్యగా స్వీకరించే బాధ్యత నాదీ. నీవు నిద్దరపో. నీరసం వస్తుంది. అన్నట్టు నేను 15 వ. తేదీని నాగపురం వెడుతున్నాను తెలుసా?"

'ఆ! నాగపురమా! ఇంకా యేం. ఇరువైయైదు రోజులుంది. అప్పటికి నాకు స్వస్థత చేకూర కూడదూ!'

'ఎందుకు'

'ఎందు కేమిటి. నేను వస్తా నీతో. నిన్ను వదలి నిముసం గూడా వుండలేను. నన్నూ తీసికెళ్లవూ! అక్కడైనా వివాహమాడు నన్ను. నా హృదయస్థానంలో నీకు తప్ప మరెవరికి దొరకదు స్థావరం. బి. యే. పరీక్షల్లోనే నీకర్పించా సర్వస్వం. నా జీవిత శకటానికి నీవే మార్గదర్శకుడవు. నా పరమావధికి నీవే పరమేశ్వరుడవు. నా భవిష్యత్తుకు నీవే ఆధార భూతుడవు. ఏదీ ఒట్టువేయి. నన్ను తప్పకుండా తీసికెళ్లవూ? అని చెయ్యి జాపింది జాలిగా—లలిత.

'ఏమిటీ చదువు లలిత! మరేం ఫరవాలేదు. ఇదిగో వాగ్దానం.' అని కరం స్పృశించాడు శంకరం. 'మరి మీ నాన్న వచ్చే వేళైంది. నేను వెడుతున్నా. నెమ్మదిగా పడుకుని నిదురించు, లేకపోతె నీరసం హెచ్చవుతుంది.' అని లలిత శిరోజాలు నిమురుతూ లేచి గృహోన్ముఖుడై వెళ్లిపోయాడు శంకరం.

శంకరం లలితల వియోగ సాగరంలో కాలనావ గంతులిడుచు పరుగులెత్తింది. లలిత తపించే తారీఖు వచ్చింది. ఆమె వదనంలో ఆనందరేఖలు తాండవిస్తున్నాయి. శంకరం నాగపురమునకు ఉద్యోగాన్వేషణకై బయలుదేరుతూ లలితా మందిరానికి వేంచేశాడు. శంకరంకొరకు ఎదురు చూస్తూ లలిత పెరటి సావిట్లో తారట్లాడుతోంది. రాత్రి 9 గంటలు కావచ్చినది. రజనీచరుడు తన ఆరాధ్యరమణి రోహిణి కొరకై తారామండలంలో చరిస్తున్నాడు. శంకరం లలితను చూచి 'లలితా' అన్నాడు శాంతంగా.

పిలుపు వినగానే తలుపు చాటునుండి 'ఎవరు?' అంది ప్రశ్నార్థకంగా లలిత. 'నేను. నా పేరు శంకరం. మ… తెలవిస్తావేమో నని—

ఆనందాతిశయంతో శంకరం చేతులు పుచ్చుకుని 'నన్ను గూడా తీసికెళ్లవూ! నీవు తీసికెళ్లకపోతే నేను బ్రతుకలేను. అని కన్నీరు పెట్టుకుని 'ఏ నుయ్యో! గొయ్యో!' అం… ఆపుకునే దుఃఖంతో.

పరిణయ చిహ్నం

'వినవూ! నే చెప్పినమాట వినవూ లలితా. మీ నాన్న గాని, యింకెవరైనా వింటే నన్నేం చేస్తారో తెలుసా? ఆలోచించు. కలలోగూడా నిన్ను మరువను—తిరిగి మళ్లీ నిన్ను కలుస్తా.' అంటాడు శంకరం బ్రతిమాలుతూనూ.

'ఆలా వల్లకాదు. మా నాన్నగారు, అందరూ పెద్దగా నిద్దర పోతున్నారు. ఇప్పుడు నేను కూడా వస్తే గుర్తించే వారెవరూ లేరు. లే! ఆలస్యం చేస్తే ఏ అలికిడో తగులుతుంది. అనుమానం కొద్దీ ఆగవలసి వస్తుంది. లే, అని తొందర చేస్తుంది లలిత.

'అయితే రా! త్వరగా రా. ఈ వస్తువులుగూడా ఎందుకు?' అంటాడు శంకరం.

'ఈ వస్తువులుగూడా నాతోనే వస్తాయి. జడుస్తావేం శంకరం? కాస్త యీ సంచి...'

'ఆ ఇల్లాగ యియ్యి' అని శంకరం లలిత హస్తం పుచ్చుకుని గ్రుడ్డి వెన్నలలో పడుతూ, లేస్తూ బండిదగ్గరకు వస్తాడు. కూత వెయ్యటానికి సిద్ధంగావుంది రైలు వీరిద్దరి కోసమా అన్నట్టు. శంకరం చకచకా టికెట్లు తీసుకుని లలితతో బండెక్కుతాడు. కాలప్రమాణంలో రైలు ప్రయాణం కనపడని అనువులాగ వుంది వారుభయులకు. నూతన వధూవరుల పాతగాథలతో పరుగుతీస్తోంది ధూమ శకటం. ప్రపంచంలో లేని ప్రణయమా అన్నట్లు నంగనాచి వలె నాగపురంచేరి లలితాశంకరంలను దింపుతూ, కళ్యాణాశీర్వాదాన్ని కూతతో వెదజల్లి వెళ్లిపోయింది రైలు. శంకరం లలితలు నాగపురం కాపురస్తులయ్యారు నాటికి. భగవంతుని కృపవలన కొద్దినాళ్లకే 200 రూపాయిల జీతంతో కాలేజీలో కుదుటుపడ్డాడు శంకరం. కొన్నాళ్లయ్యేసరికి లలిత హృదయంలో పల్లవి ప్రారంభమైంది.

శంకరం ఒకనాటి సాయంత్రం బజారుకు వెళ్లి, నెక్లెసు ఒకటి కొనితెచ్చి జేబులో వుంచుకుని లలితతో కులాసాగా కాలం గడుపుతున్నాడు.

'మరి ఏమైంది?' అంది లలిత.

'ఏమిటి—ఏమౌతుంది—అంతా మామూలే.'

'మామూలవుతే ఎట్లా? నిశ్చయంచేసుకోరాదూ?

'ఖాయమయింది. నెలకు 200 రూపాయలతో?'

'అదిగో చూచారా, అప్పుడే పరాకు. జీతం విషయం కాదు. మన జీవితసమస్య. భగవంతుని కరుణ వుంటే మన పరిణయం ఎప్పుడూ?' అంటుంది లలిత.

'ప్రణయ ప్రవాహాలు రెండూ లగ్నమై పరుగుతీస్తూ వుంటే పరిణయం దేనికి? లలితా మనకు ముహూర్తం అచ్చిరాలేదు. ?

'సుముహూర్తం కాకపోతే దుర్ముహూర్తమా లెక్క.

'అదికాదు నేననేది. నీ ఇష్టం ఎప్పుడుపడితే అప్పుడే ఇదుగో కళ్లుమూయి. గమ్మత్తు చేస్తా.

'ఏం! ఏమిటి? ఎందుకు!' అని కళ్లు మూసుకుంటుంది లలిత.

'ఇదిగో పరిణయ చిహ్నం—ప్రేమ ముద్రిక—భాగ్య చంద్రిక — సువర్ణ సూత్రం — మహిళా మనోరంజని.' నిష్కల్మషంగా, నిరాఘాటంగా నీ కలంకరింప జేస్తున్నా.

అంటూ శంకరం లలితమనోలతను తనమదికి అల్లుకుంటూ బోసిపోయే ఆమె లేతమెడలో సువర్ణ హారాన్ని సొంపుగా పడవేసి, తనివితీరా ముద్దు పెట్టుకున్నాడు.

లలిత కలతచెంది కంగారుతో మెడ చూసుకుని మెరిసిపోయే నెక్లెసును చూసి మురిసిపోయి, తన్మయత్వంతో శంకరం ఒడిలో వాలిపోయి అతని ప్రేమైకదృష్టిని ఆకర్షించింది.